కథా నిలయం
3473
శ్రీకాకుళం

# కాలానికి దూరంగా...

చూస్తూండగా గత అయిదారు సంవత్సరాల్లోనూ తిరుమలరావు పేరు ప్రతిష్ఠలు తారాపథం అందుకున్నాయి. "అరనిచిచ్చు" "పిచికలగూడు" "కోట గోడలు" మొదలయిన నవలలు ఒకదాని వెనక ఒకటి పండితులు మొదలు పామర్లు వరకూ మెచ్చుకోవడంతో సాహితీ వేత్తల్లో ముందు వరసలోకి చొచ్చుకొచ్చేసేడు. మహా మహా కొమ్ములు తిరిగిన రచయిత(త్రు)లనుకున్నవాళ్ళంతా తమ కళ్ళ ముందరే చూస్తూండగా కాశ్మీరు శాలువాలూ, పట్టు కండువాలూ, పూలదండలూ వేయించుకుంటూ సాహిత్య గర్భంలో నిలువునా వేళ్ళు తన్నేసి నిలబడి అట్టహాసం చేస్తున్న తిరుమలరావు పేరు వింటే గుడ్లు తేలేస్తున్నారు. అతని రచనలు వరదలై పత్రికా ప్రపంచాన్ని ముంచేస్తుంటే గుడ్లప్పగించి చూస్తున్నారు.

రచయిత ఎంతవాడు అంతవాడుగానే వుంటే యిబ్బందిలేదు. మా వీధిలో నా అంత రచయిత మరోడు లేడు. అలాగే వాళ్ళ కాలనీలోకల్లా గొప్ప రచయితగా వుండిపోతే తిరుమలరావుని మాత్రం ఎవరేమంటారు? యాచకస్య యాచకో శ్శత్రుః అన్న సామెత ముఖ్యంగా రచయితలకి అన్వయిస్తుంది. కష్టపడి చమటోడ్చి రాస్తే వొచ్చిన ప్రతిఫలమల్లా కాస్తంత పేరు. దాంట్లో కూడా యింత కాంపిటీషనంటే కళ్ళూ వొళ్ళూ మండవూ?

అయిదారేళ్ళ క్రితం వరకూ తిరుమలరావు రచనలు మామూలు సంసారిక సాధక బాధకాల సరిహద్దుల్లో సాధారణ స్థాయిలో వుండేవి. ఒక సందేశాన్ని కాని, ఒక సాంఘిక సమస్యకి పరిష్కారాన్ని కాని అతని రచనల్లో ఎన్నడూ ఎవడూ చూడలేదు. నేనూ తిరుమలరావూ పత్రికల్లో పడ్డ మా రచనల గురించి పరస్పరం అభినందించుకునేవాళ్ళం. అలాంటివాడు ఉన్నట్టుండి ధర్మ సంస్థాపనార్థం సంభవించిన యుగపురుషుడు లాగ సాంఘిక సమస్యల్ని ఆధ్యాత్మిక

మసాలాతో మేళవించి ప్రబోధాత్మకమైన నవలలు రాయడం, అది చదివి ప్రజలు ఓహో అంటే ఓహో అని మెచ్చుగోవడం చూస్తూంటే నాబోటిగాడికి కథలు రాయడమంటేనే చేతులాడటం లేదు.

* * *

అంతా పది రోజుల క్రితం అనుకుంటాను, అరుణా విశ్వనాథ్ రాసిన 'మా పాప' నవలకి సాహిత్య ఎకాడమీ ఎవార్డ్ వొచ్చిన సందర్భంలో ఆ దంపతులు వాళ్ళింట్లో ఓ పార్టీ ఏర్పాటు చేశారు. భోజనాలయ్యాక అక్కడో సాహిత్య గోష్ఠి తయారైంది. అందరూ ఇతోధికంగా 'మా పాప'ని పొగిడేరు. నిజానికి అందులో ప్రత్యేకత ఏమీ లేదు. శుద్ధ దేశవాళీ సరుకు. కథ అష్ట వంకర్లుగానూ తిరిగి చివర ఘట్టంలో ప్రేమికులు వాళ్ళ మూడేళ్ళ కుర్రాణ్ణి పీటమధ్య కూర్చోపెట్టుకుని వర్ణాంతర వివాహం చేసుకుంటారు. అయితే,అందులోని కొన్ని సన్నివేశాలు యీమె రాసినవేనా అనిపించేటంత బాగున్నాయి.

అరుణ భర్త విశ్వనాథ్ చాలా సరదా అయిన వాడు. లక్షలు లక్షలు రెండు చేతులా సంపాదిస్తున్న ఫిల్ము డిస్ట్రిబ్యూటరు. వాళ్ళ పెళ్ళయి నాలుగేళ్ళయింది. అప్పట్నుంచీ ఏదో పేరు చెప్పి పదిమంది రచయితల్ని పోగేసి తరచు పార్టీలివ్వడం అతనికి సరదా. సభలన్నా సన్మానాలన్నా సోవనీర్లన్నా ధారళంగా విరాళాలు, ఎడ్వర్టైజుమెంట్లూ యిస్తూంటాడు. పైగా, చదువూ సంస్కారం, పదిమందిలో గౌరవం, పలుకుబడి గలవాడు. ఎకాడమీ సకాలంలో మేల్కొని అరుణ పుస్తకాన్ని గౌరవించింది. లేకపోయినా దానికి పదిరెట్లు అట్టహాసంతో అరడజను మినిష్టర్లని పిలిచి బ్రహ్మాండమైన సన్మాన సభ ఏర్పాటు చేయించుకోగల సమర్థుడు.

"అరుణని యిప్పుడప్పుడే మరో నవల ప్రారంభించొద్దంటున్నాను" అన్నాడు విశ్వనాథ్.

"అన్యాయం, ఘోరం, మహాపాపం భార్య భావ స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి మీకేమి హక్కుందని? తెలుగు రచయిత్రుల భర్తల సంఘం స్థాపించి మీ దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ ఉద్యమం లేవదీస్తాను" అంటూ బెదిరించేడు ముళ్ళ సత్యం (ఉరఫ్ ముత్యం).

"చేస్తే చెయ్యండి కాని, ఒకటి మాత్రం ఖాయం. అరుణ నవలంటూ రాస్తే యింతకంటే మంచిది రాయాలి. అంతేకాని పేరొచ్చింది కదా యింత

ఏమిరాసినా చలామణి అవుతుందన్న గర్వంతో చెత్త రాస్తే ఒప్పుకోను'' అన్నాడు విశ్వనాథ్.

''అలా ఎందుకనుకుంటారు? రాసిన కొద్దీ చెయ్యి నలుగుతుంది. ప్రపంచానుభవం, విమర్శనాశక్తి, రచనాభిలాష ఆనాటి కానాడు పెరుగుతాయి. కనక, ముందు రాసిన వాటికంటే తర్వాత రాసినవి బాగుండి తీరతాయి" అన్నాడు పత్రికా విలేఖరి విశ్వం.

''కాని, పరిణామం దానికి వ్యతిరేకంగా కనబడుతుంది. పెద్ద పెద్ద రచయితల సంగతే చూద్దాం. మొదట్లో రెండో మూడో ఠప్ ఠప్‌మని రాసి పేరు సంపాదిస్తారు. ఇక జీవితాంతం ఆ పేరు నిలబెట్టుకోడానికి ఆరాటం, పోరాటం. ఈ మధ్య వాళ్ళు రాసినవి మొదట్లో వాళ్ళు రాసిన వాటితో పోల్చి చూస్తే వాళ్ళే వీళ్ళానిపిస్తుంది'' అంది అరుణ.

''అలా అని రాయడం మానేయమంటారా? ప్రేమ, పెళ్ళి, తాలూకు సమస్యలు తప్ప మనకి కథా వస్తువులు లేనప్పుడు రకరకాల 'పెర్ముటేషన్స్ ఎండ్ కాంబినేషన్స్' ఉపయోగించి రాసుకుంటూ పోవడమే. రాసేవాళ్ళ అభిరుచికీ చదివేవాళ్ళ అభిరుచికీ మధ్య మంచి సమన్వయం కుదిరింది. కనకనే సాహిత్యం మహా వృక్షమై ఇంత మందికి ఆశ్రయమిస్తుంది'' అన్నాడు కొత్తగా పత్రిక ప్రారంభించిన శతభిషం.

''నిజంగా మనం తిరుమలరావుని గురించి గర్వపడాలి. అయిదేళ్ళ క్రితం అతని రచనలకీ యిప్పటి రచనలకీ పోలికుందా?'' అన్నాడు న్యూస్ రీడర్ ప్రకాశం.

''అతనదృష్టవంతుడు. అయిదేళ్ళ క్రితం భార్య పోయింది. వెంటనే వాళ్ళ కాలేజీలోనే అసిస్టెంట్ లెక్చరర్‌గా పని చేస్తున్న చక్కని చుక్కలాంటి అమ్మాయిని పెళ్ళాడేడు'' అన్నాడు విశ్వం.

''అంతేరా బ్రదర్! భగవంతుడు రచయితల కనీస అవసరాల్ని గుర్తించనంతకాలం సాహిత్యం గతింతే. ఏదో విధంగా దుఃఖం దిగమింగడానికి అందమైన అమ్మాయిల మీద కథల్లి కాలక్షేపం చేస్తుంటే, రచనల సాంకేతిక స్థాయి దిగజారక ఎగబాకుతుందా?" అంటూ వాపోయాడు శతభిషం.

''వాడి ప్రతాపం మాత్రం ఇంకెన్నాళ్ళు? కొత్త పెళ్ళాం! ఎప్పటికీ కొత్త పెళ్ళాంగానే వుండదు'' అన్నాడు ఆవేశంతో ఆశావాది ముత్యం.

''ఛీ!ఛీ! వూరుకోండి!'' చేతిలో వున్న 'మా పాప' ప్రతి ముత్యం మీదికి అరుణ గిరవాటెట్టడంతో ఆ టాపిక్ అంతటితో ఆగింది.

అందరూ వెళ్ళిపోయాక నన్ను ఇంట్లో దిగపెట్టడానికి కార్లో తీసు కెడుతూ ''ఉన్నట్టుండి తిరుమలరావు గారు ఇలా ఎలా రాయగలుగుతున్నా రంటారు?'' అన్నాడు విశ్వనాథ్.

''అలా నేనెందుకు రాయలేక పోతున్నానో తెలిస్తే అతనెలా రాయ గలుగుతున్నాడో గ్రహించగలిగేవాణ్ణి'' అన్నాను.

''అవి ఆయన సొంతంగా రాసినవి కావనీ, అలాంటివి తనెక్కడో చదివిన జ్ఞాపకముందనీ అరుణ కూడా అంది'' అన్నాడు, అతని ప్రతీ అక్షరంలోనూ అసూయ తొణికిసలాడుతుండగా.

''షేక్స్పియర్ డ్రామాలన్నీ రాసింది మరొకడనే వాదన కూడా వుంది. అటువంటి సందేహం కలగకుండా వుండాలే కాని కలిగితే ఎన్నైనా ఆధారాలు ఊహకి అందుబాటులో వుంటాయి" అన్నాను, మళ్ళీ ఆ మాటెత్తకుండా. అతని పెళ్ళామో గొప్ప రచయిత్రి అని అతని నమ్మకం. నిజానికామె విశ్వనాథ్ భార్యే కాకపోతే ఎకాడమీ ఎవార్డ్ వొచ్చుండదన్నది నిర్వివాదాంశం.

* * *

ఆనాటి విమర్శనలు యింకా నా చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. ఇంతట్లోకే హటాత్తుగా గుండెపోటుతో తిరుమలరావు చచ్చిపోయాడన్న దుర్వార్త దిగ్భ్రమ కలిగించింది. నేను హైదరాబాద్ వెళ్ళేటప్పటికి అంత్యక్రియలు అయి పోయాయి సంతాప సభకి మాత్రం టైముకి అందుకున్నాను. ఆనాటి పత్రికలన్నీ కంటతడి పెట్టేయి. రేడియో కూడా గొల్లుమంది.

వాళ్ళింటి కెళ్ళి తిరుమలరావు రెండో భార్యని పరామర్శిద్దా మనుకున్నాను కాని, మళ్ళీ మనస్కరించక వూరుకున్నాను. తిరుమలరావు మొదటి భార్య బ్రతి కున్న రోజుల్లో తరచు వాళ్ళింట్లోనే దిగతూండేవాణ్ణి. వాళ్ళది నిజంగా చిన్న కుటుంబం, చింతలు లేని కుటుంబం రెండో భార్యని కట్టుకున్నాక నేను వాళ్ళింటికి వెళ్ళడం పడలేదు. పెళ్ళయ్యే ముందోసారి తన డిపార్టుమెంటులో

అసిస్టెంటుగా ఆమెనోసారి పరిచయం చేశాడు. ఆమె యమ్మెస్సీ పేసయిందట. తెలుగు మాట్లాడటం వొచ్చును కాని, చదవటం రాదుట. కొంచెం ముభావంగా వున్నా మంచి రూపం, హుందాతనం ఆమెలో కొట్టొచ్చినట్టు కనబడతాయి. ఆమెని తొలిసారిగా తను ఫెలోషిప్ మీద అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ కలుసుకున్నాడుట. అంతక్రితం రెండేళ్ళ నుంచీ ఆమె అక్కడే రిసర్చ్ స్కాలర్‌గా వుందట. మొత్తంమీద పాపం, చాలా దురదృష్టవంతురాలు! ఏది ఏమయినా ఆమెని కలుసుకుని ఓదార్చవలసినంత సన్నిహితుణ్ణి కాదు. కనుక మర్నాటి ఉదయం తిరిగి వెళ్ళిపోడానికి నిర్ణయించుకుని నడుం వాల్చేను. ఇంతలోకే హోటల్ బోయ్ వొచ్చి నాకోసం ఎవరో వొచ్చేరని చెప్పేడు. పిలవమన్నాను. వచ్చినవాడు కేన్సర్ హాస్పటల్లో వార్డ్‌బోయ్‌ట. "గుడ్ మార్నింగ్ సార్! మీకు నిరంజన్‌గారీ వుత్తరం యిమ్మన్నారు'' అంటూ ఓ కవరు చేతికిచ్చేడు. నిరంజనంటే ఎవరో గుర్తురాలేదు.

"నిరంజన్‌గారేం చేస్తున్నారు?'' అని అడిగేను కవరు చింపుతూ.

''కేన్సర్ హాస్పటల్ స్పెషల్‌వార్డ్ 'బి'లో రూం నెంబర్ త్రీ సార్! లివర్ కేన్సర్, హోప్లెస్ కేస్ సార్!'' అన్నాడు నా ప్రశ్నకి విపులంగా సమాధానమదే అయినట్లు.

ఉత్తరం తీసి చదివేను. ''నన్ను మరిచిపోయి వుంటారు. అయిదేళ్ళ క్రితం ఓ సాయంత్రం ఫుల్‌మూన్ హోటల్లో కలుసుకున్నాం. అప్పుడు మీరు అ.భా.తె.ర.మ. సభకి డెలిగేట్‌గా వొచ్చేరు. తిరుమల్రావు గారి అకాల మరణం సందర్భంలో నిన్న జరిగిన సంతాప సభకి మీరొచ్చేరని ప్రాంతీయ వార్తల్లో విన్నాను. ఆ విషయంలో అత్యవసరంగా మీతో ఏకాంతంగా మాట్లాడాలి. దయయుంచి తప్పకుండా రండి - నిరంజన్.''

''నే నీ హోటల్లో వున్నానని ఎలా తెలుసు?''

''ఏదో పేపరాఫీసుకు ఫోన్‌చేసి కనుక్కున్నారండి. తప్పకుండా రావాలి సార్! చాలా ట్రాజడీగా వున్నారు. ఎప్పుడొస్తున్నారో కనుక్కురమ్మన్నారు సార్!'' అన్నాడు. సాయంత్రం వొస్తానని చెప్పమన్నాను.

అయిదేళ్ళ క్రితం తెలుగు రచయితల మహాసభకి తిరుమల్రావు ఆహ్వాన సంఘాధ్యక్షుడు. నేనూ దానికో డెలిగేట్నే. తిరుమల్రావు చాలా హడావిడిగా

వున్నాడు. ఓ సాయంత్రం ఏమీ తోచక సరదాకని కొత్తగా తెరచిన ఫుల్‌మూన్ హోటల్‌కి వెళ్ళి ఆరుబయట లౌంజ్‌లో కూర్చున్నారు. అట్టే రష్ లేదు. ఇంతలోకే గుడీవినింగ్ అనే అపరిచిత కంఠం వినపడటం, వెంటనే ఆ కంఠం తాలూకు మనిషి ప్రత్యక్షమై నాకో మందహాసం ప్రసాదించి నాముందు కుర్చీలో కూర్చుని "బోయ్! ఆ టేబుల్ మీదున్న బాటిలూ గ్లాసు యిక్కడ పెట్టి, మరో గ్లాసు సోడా తీసుకురా" అనడం క్షణంలో జరిగిపోయింది. తర్వాత నావైపు తిరిగి "నా పేరు నిరంజన్. మిమ్మల్ని గురించీ మీ రచనలు గురించీ తిరుమలరావు గారు చెబుతూ వుంటారు. ఉదయం సభలో మీరు కథానికల్ని గురించి చేసిన ప్రసంగం చాలా బావుంది" అన్నాడు.

నేను లేచ్చక్కా పోదా మనుకున్నాను. ఆ సభ రభస భరించలేక యిక్కడి కొచ్చేను. ఒకటే గందరగోళం. మాట్లాడే వాళ్ళెక్కువ, వినేవాళ్ళు తక్కువ. ఎవర్నైనా పలకరిస్తే - చాలు రెండు నిముషాలు ఆ మాట యీ మాట చెప్పి, మూడో నిముషంలో తన కొత్త రచనల ప్రస్తావన తీసుకొచ్చి, అక్కడికక్కడే నిలబెట్టి కొంత భాగం చదివి వినిపించడం, ఇంకా మనలో సహనం ఉందని తోస్తే, రాత్రి మనం ఎక్కడుంటామో చెబితే, అక్కడికొచ్చి మిగిలిన రసవత్తరమైన భాగాలు వినిపిస్తామంటూ పీక్కుతినడం! ఇదీ వరస! ఈ మూన్‌లో కొచ్చిన జలగలాగ తగిలేడు వీణ్ణి వొదుల్చుకోవడం ఎలాగా అని ఆలోచిస్తూ గ్లాసు పైకెత్తి "చియర్స్, మీ రెవరికోసమో ఎదురుచూస్తున్నట్టున్నారు" అన్నాను ఫుల్‌బాటిల్ ఉండటం చూసి.

"నేనీ వూరొచ్చి ఆర్నెళ్లయింది. నాకున్న స్నేహితు లిద్దరే. మొదటి స్నేహితుడు తిరుమలరావు, రెండో స్నేహితుడు వీడు" అంటూ బాటిల్ కేసి చూపెట్టాడు.

నేవీ బ్లూ స్ట్రెచ్‌లాన్ పాంటూ, వైట్ ఓపెన్ కాలర్ టెరికాట్ షర్టు, చామన చాయతో కండలు తిరిగిన శరీరం, మెరిసే నల్లటి జుట్టూ, మొహం మీద దట్టమైన స్ఫోటక మ్మచ్చలు. అది ఫేషనో జబ్బో తెలియదు - నల్లద్దాలున్న లైబ్రెరీ ఫ్రేము కళ్ళజోడు. సినిమాలో విలన్ లాగున్నాడు. వయస్సు ముప్పయ్యే యిదుంటాయి.

"మీరేం చేస్తున్నారు ?" అడిగాను.

"ప్రస్తుతం రెండు వేళలా యిదే చేస్తున్నాను. నేను యమ్మే పేసయ్యాను. స్వగ్రామం గుంటూరు. మా మేనమామ యేళయ్యేళ్ళ క్రితం ద్వీపాంతర వాస శిక్ష మీద అండమాన్స్ వెళ్ళాడు తర్వాత అక్కడే స్థిరపడి టింబర్ అండ్ కేన్ ఎక్స్‌పోర్టు వ్యాపారంచేసి లక్షలు గడించేడు. పోర్టు బ్లెయిర్‌లో కిరీటంలేని రాజుగా వెలిగి ఏడాది క్రితం పోయాడు. ఆయన ఆస్తికి వారసుల్లేకుండా పోతా రేమోనని మా తల్లిదండ్రులు నన్నక్కడికి పంపి కృతార్థులయ్యేరు నేను ఎనిమి దేళ్ళుగ అక్కడేవుంటూ ఈ మధ్యనే యిక్కడికొచ్చేను" అన్నాడు నిర్లిప్తంగా.

''ఇండోమాన్స్ ఎక్స్‌పోర్టు కార్పొరేషన్ అన్న ఎడ్వర్‌టైజ్ మెంటు సావ నీర్లో చూశాను'' అన్నాను.

"ఓ! చూశారా? అదే మా ఫర్మ్."

"మీకు తిరుమల్రావుతో ఎలా పరిచయమైంది?"

"ఆయన రాసిన 'జూలియో రోమియెట్' అనే వ్యంగ్యనాటిక రేడియోలో విని అభినందిస్తూ ఆయనకి ఉత్తరం రాశాను. జవాబు రాశారు. అలా ప్రారంభ మైన మా పరిచయం స్నేహంగా మారింది" అన్నాడు.

"ఎన్నాళ్ళుంటారిక్కడ?" అడిగేను.

"ఇంకా ఏమి నిర్ణయించుకోలేదు.''

"మరి మీ కుటుంబం?"

"ఆ బెడదేమీ లేదు."

"ఇంకా పెళ్ళాడలేదన్నమాట?"

బాటిల్ మళ్ళీ అందుకుని గ్లాసులో పోసుకుని రెండు అయిస్ క్యూబ్స్ వేసుకుని నా మొహంలోకి చూస్తూ వో చిరునవ్వు విసిరి "పెళ్ళయింది కాని, విడిపోయాం' అన్నాడు.

చదువూ డబ్బూవున్న యువకుడు నిరంజన్. నడిమంత్రసిరి కారణంగా అలక్ష్యంచేసో, హింసించో, నయాన్నో భయాన్నో పెళ్ళాం గొంతుకోసి వీడు విచ్చల విడిగా అచ్చోసిన ఆంబోతులాగ తిరగడం అలవాటు చేసుకునుంటాడు. ఇలాంటి దుర్మార్గుల్ని దండించడానికి కేదైనా గట్టి చట్టం వుంటేనే కాని ఈ సమాజం బాగుపడదు. వాడి తాగుడూ వాడి దేవదాసు పోజూ చూస్తుంటే నిజంగా

నాకు వొళ్ళు మండింది నేనింకా మొదటి పెగ్గులో వున్నాను. వాడప్పుడే రెండో పెగ్గు మూడో పెగ్గులో కొచ్చాడు చదువూ డబ్బూ ఆరోగ్యం దుర్వినియోగం చేసుకోవడం, బాధ్యతలేని పోరంబోకులా జీవించడం ఈనాటి యువకులలో ఫేషనయిపోయింది. అలా ఆలోచిస్తూంటే "మీ ఆలోచనలూ అంచనాలూ తప్పు. ఆమె లక్షాధికారి కూతురు. చదువుకుంది, అందమైంది. మా గుమాస్తాతో లేచి పోయింది" అన్నాడు.

క్షణంపాటు నా ఆలోచనా శక్తి స్థంబించిపోయింది. కాస్త తేరుకొని "మీ తల్లిదండ్రులూ అన్నదమ్ములూ...." అంటూండగా" అందరూ గతించారు. ఒక్క చెల్లెలుంది. బియస్సీ పేసయింది. మెడిసన్ చదువుతానంటే దొనేషన్ కట్టి చేర్పించేను. పుష్కలంగా డబ్బుపంపి జాగ్రత్తగా చదువుకోమన్నాను. ఇప్పుడు మణిపాల్లో రెండో యేడు చదువుతోంది. ఒక ఫైనలియర్ విద్యార్థిని ప్రేమించిందట. ఈలోగా దానికి అయిదేళ్ళ చదువుకోసం యిచ్చిన డబ్బూ ఖర్చు పెట్టేసిమళ్ళీ డబ్బుకోసం రాసింది. వీల్లేదు పొమ్మన్నాను. ఇన్నాళ్లు యిద్దరూ కలసి జల్సాగా గాలిలో తేలిపోతూ డబ్బు తగలేసుంటారు డబ్బంతా అయిపోయాక భూమ్మీద పాదాలు మోపింది. ఈలోగా ఆ కుర్రాడి తల్లిదండ్రులు తమ బుద్ధిమంతుడైన కొడుకు పొరబాటున ఒక స్ట్రీట్ బిచ్ వల్లోపడి భ్రష్టుడై పోయినట్టు గ్రహించి మా చెల్లెలు మొహంమ్మీద వుమ్మేసి పొమ్మనుంటారు. అకుర్రాడు కూడా యిప్పుడు కళ్ళు తెరిచి ప్రేమ మైకంలోంచి బయటపడి బుద్ధిగా తల్లిదండ్రులు చూపెట్టిన పిల్లనే పెళ్ళాడటానికి నిర్ణయించుకున్నాడట. అదీ వాళ్ళ ప్రేమ పర్యవసానం."

"చెల్లెల్ని వెళ్ళి కలుసుకున్నారా?"

"కలుసుకునేం చెయ్యాలి? ఒకళ్ళనొకళ్ళు అభినందించుకోవాలా? నా పెళ్ళాం లేచిపోయింది; దాన్ని మొగుడొదిలేశాడు. డబ్బు పంపలేదని పవురష మెచ్చి నాకు ఉత్తరాలు రాయడం కూడా మానివేసింది."

"ఆమె భవిష్యత్తును గురించి ఆలోచించేరా?"

"మానాభిమానాలు మిగిలి వుంటే ఎప్పటికైనా మనిషిగా మారుతుంది. లేదా, యిలాంటివాళ్ళు ఆ తిరుగుడుకే అలవాటుపడితే వ్యభిచారిణులుగా మారుతారు. ఈమె గతీ అంతే కావచ్చు."

"వాటే ట్రాజడీ!"

"ట్రాజడీ కాదు, కామెడీ కాదు. ఈ ప్రేమనేది కేవలం లాటరీ. నిజం చెప్పండి. అసలు ప్రేమించడమంటే ఏమిటి? కామించడం, మోహించడం, శరీరానికీ మాటలకీ పరిమితమైన ఆకర్షణ. ఎటొచ్చీ సాహిత్యంలోనూ సినిమాల్లోనూ ఈ ప్రేమని చిరునవ్వుతో ఆహ్వానించి, కన్నీటితో కడిగి, సెంటిమెంటుతో అలంకరించి, హృదయ చౌర్యం ఆత్మార్పణ అనే మేళ తాళాలతో బ్రహ్మరథం పడతారు. ఈ రోజుల్లో బొడ్డూడని కుర్రకుంక కూడా 'వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు' అని చెబితే అంతా అర్థమైనట్లు తలూపుతాడు. 'ప్రేమే దైవం దైవమే ప్రేమ' అంటూ దాని చుట్టూ గుడికట్టి మనం ఆరాధించడం, ప్రేమించుకున్నా మనుకుంటున్న యువతీ యువకులు వాళ్ళ సువిశాల హృదయాల్ని ప్రదర్శిస్తూ తల్లి తండ్రుల్ని ధిక్కరిస్తూంటే మనం బేష్ అని తప్పట్లు కొట్టడం! కని పెంచి లాలించి పోషించి పెద్దచేసిన వాళ్ళను ప్రేమించలేని తమ పిల్లలు ఇతరుల నెలా ప్రేమిస్తున్నారో అర్థంకాని తల్లిదండ్రులకి గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు వాళ్ళ పిల్లలొచ్చి వాళ్ళ ప్రేమను గురించీ దాని ఆదర్శాన్ని గురించీ అమరత్వాన్ని గురించీ ధర్మపన్నాలు బోధించడం-దాన్ని మనం సమర్థించడం!" అప్పటికే నిరంజన్ ధోరణి శృతిమించింది. రెండుసార్లు స్టూవర్ట్ వొచ్చి కాస్త నెమ్మదిగా మాట్లాడమని హెచ్చరించాడు. మంచి చెడ్డల విషయం ఎలా వున్నా అతని భావావేశాల్లో వున్న సిన్సియార్టీ నన్నాకర్షించింది.

"మీరు ప్రేమని మరీ జనరలైజ్ చేసి తుడిచి పారేస్తున్నారు. కుల తత్వాలూ, వరకట్నాలులాంటి సాంఘిక దురాచారాల్ని అరికట్టడానికి ఈ ప్రేమ అనే పాప్యులర్ సెంటిమెంట్‌ను ప్రోత్సహించడం అవసరం. మీరు చెప్పినట్టుగా ప్రేమ కేవలం కామానికి బురఖాయే కావచ్చు. అలాంటి స్వాతంత్ర్యం యువతీ యువకులకు అవసరం'' అన్నాను.

''నాన్‌సెన్స్! సంఘ సంస్కారం దృష్టిలో పెట్టుకుని యువతీ యువకులు ప్రేమించుకోరు. అది అర్థంలేని వాదన. ఏక వర్ణ వివాహాలు నిషేధించి వర్ణాంతర వివాహాలే వుండాలని శాసనం చేసినా ఈ ప్రేమ సమస్యల్ని పరిష్కరించలేరు. ఈనాడు ప్రచారంలో వున్న సాహిత్యంలో ప్రోత్సహించే యువతీ యువకుల స్వాతంత్ర్యం ముఖ్యంగా స్త్రీలను తప్పుదారి తొక్కిస్తుంది. మాట వరసకి మీ 'గాజుబొమ్మ' కథ తీసుకోండి....''

ఇంక యీ సంభాషణకి స్వస్తి చెప్పి బయటపడదామనుకుంటుంటే నా కథ ప్రసక్తి తీసుకురాగానే సహజ దౌర్బల్యంతో వళ్ళీ మెత్తబడి చతికిలబడ్డాను. అందులోనూ ఈ కథ రాసి చాలా కాలమైంది అదే నేను రాసిన మొదటి కథని జ్ఞాపకం. అతను చెప్పుకుపోతున్నాడు....

''అందులో నాయిక చదువూ సంస్కారం లేని పల్లెపడుచు పచ్చగడ్డి అమ్ముకోడానికి పట్నంవొస్తూ పట్నవాసం గాలీ నీరూ వొంటబట్టి ఇద్దరు కాలేజీ కుర్రాళ్ళ వలలోపడి, ఆ జీవితమే శాశ్వతమన్న భ్రమతో తన వూరూ, భర్తా, సంసారం విడిచిపెట్టి చివరకి గతిలేక పడుపు వృత్తిలోకి దిగుతుంది. ఆమె జీవిత గాథ చదువుతుంటే కళ్ళల్లో నీళ్ళు తిరగకుండా వుండవు. కథలో పాత్రల చిత్రీకరణ సహజంగా వుంది. స్త్రీ స్వాతంత్ర్యానికి అవసరమైన హద్దులు అడుగడుగునా అభివ్యక్తమవుతాయి. అందుకే అప్పుడూ యిప్పుడు కూడా మిమ్మల్ని 'గాజుబొమ్మ' కథారచయితగానే జ్ఞాపకముంచుకుంటూ వుంటాను'' అన్నాడు.

''థేంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్'' అన్నాను, ఇంక లేవడాని కుద్యుక్తుణ్ణవుతూ

''మీరిటీవల రాసిన 'రాబందు రాయబారం' నవల తీసుకోండి. మీకున్న పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా సమాజానికో సందేశాన్నివ్వాలన్న ఆకాంక్షతో దాన్ని రాసి వుంటారు. అందుకే అది అసహజంగానూ పేలవంగానూ వుంది. ఏవో ఆదర్శాలు మనస్సులో పెట్టుకుని పాత్రలకి సంకెళ్ళు వేసి రైలును పట్టాలమీద నడిపించినట్టుగా వుంది మీ నవల పోకడ. కథానాయకుడు ప్రసాద్ మనిషికాదు-దేవతారూపం! ధైర్యం, చదువూ, సంస్కారం, ధైర్యం, దానం, ధర్మం, త్యాగం మూర్తీభవించిన సినిమా హీరో!!"

"అవును. అలాంటి పాత్రనే సృష్టించాలనుకున్నాను. ఆ స్వాతంత్ర్యం నాకు లేదా?"

"ఉందనుకున్నారు కనుకనే మీ నవల ఈనాటి సామాజిక వ్యవస్థతో సంబంధంలేని పరమ బుద్ధిమంతుడి కథలా అసహజంగా వుంది. అదే విధంగా మీరు సృష్టించిన జయ పాత్ర కూడా దెబ్బతింది. చదువూ ప్రపంచజ్ఞానం వుండి బాధ్యత లెరిగిన వ్యక్తిగా సృష్టించేరు. ఆ అమ్మాయి ఓ కుర్రాణ్ణి ప్రేమించింది. తల్లిదండ్రుల్ని ధిక్కరించింది. గర్భవతి అయింది చివరికి దగా

పడింది. ఆమె మీద మీరెక్కడలేని సానుభూతి చూపెట్టేరు. ఆ కుర్రాణ్ణి దుర్మార్గుడన్నారు. ఆ కుర్రాడి తల్లిదండ్రుల్నీ సమాజాన్నీ దుయ్యబట్టేరు."

"అవును. జయకి అన్యాయం జరగలేదా?"

"అది కేవలం ఇద్దరి వ్యక్తుల పరిమితమైన సమస్య. అందులో సమాజం బాధ్యతేమీ లేదు. పరస్పరం ప్రేమించుకున్నారు. ఆ ప్రేమించుకోవడంలో ప్రేయసీ ప్రియులు ఒకళ్ళనొకళ్ళు ఎంత బాగా అర్థం చేసుకుంటారో తెలుసుకోడానికి వాళ్ళే తార్కాణం. దాన్నిబట్టి ఈ ప్రేమ నిజస్వరూప మేమిటో ఎంత తాత్కాలికోద్రేకమో ఎంత ప్రమాదకరమో తెలుస్తుంది."

"ఆ పరిస్థితులో జయ గతేం కావాలి?"

"నన్నడిగితే నిలువునా కిరసనాయిలు పోసి కాల్చమంటాను. దాంతో అలాంటి ఆడాళ్ళకి బుద్ధొస్తుంది దానికి చట్టం ఒప్పుకోదు కనుక, ఆ అమ్మాయి ఏ ధైర్యంతో తల్లిదండ్రుల్ని కూడా కాదని తాను వలచిన పురుషుడే దేవుడని నమ్మి లేచివచ్చిందో ఆ ధైర్యంతోనే పరిస్థితుల్ని ఎదుర్కొవాలి. ఆమె పైన ప్రత్యేక సానుభూతి అనవసరం."

"దారుణం!"

"సమాజంలో వున్న నీతికీ అవినీతికీ స్త్రీ పురుషులిద్దరూ భాగస్వాములే. ఒక స్త్రీని మోహించి మరో స్త్రీని పురుషుడే దగాచేస్తే, ఒక పురుషుణ్ణి ప్రేమించి మరో పురుషుణ్ణి దగా చేసిన స్త్రీలూ వున్నారు."

"మొగాడి బాధ్యత మరిచిపోతున్నారు."

"భారత స్త్రీని మాతృమూర్తిగా, గృహలక్ష్మిగా తీర్చిదిద్దడం మన సంస్కారం. అనాదిగా ఆమె ఆ గౌరవాన్ని అందుకుంటూనే వుంది. అలాంటి స్త్రీకి అన్యాయం చేసిన మొగాణ్ణి ఖండించవల్సిందే. స్త్రీపురుషులిద్దరూ సమానమే అనే ప్రాతిపదిక మీద ఆధారపడింది పాశ్చాత్యుల సంస్కారం. పురుషుని రక్షణ స్త్రీకి అవసరం, ఆమెని ఆదరించి గౌరవించడం పురుషుడి ధర్మం అనుకున్నప్పుడు స్త్రీ మన సాంప్రదాయాన్ని సంస్కారాన్ని గౌరవించాలి. అంతేకాని, మన సాంప్రదాయం ప్రకారం సానుభూతీ రక్షణా యిస్తూ పాశ్చాత్యుల పద్ధతిలో ఆమెకి స్వేచ్ఛ యివ్వాలనుకోవడం సిల్లీగా వుంది.''

"ఇందతా పాత చింతకాయ పచ్చడి వాదన. సహగమనం, బాల్య వివాహాలూ వితంతువులకి జుట్టు తీయించడం లాంటి మూఢాచారాలు కూడా మన సాంప్రదాయమే, వాటిని మనం సంస్కరించ లేదా?" అన్నాను వొళ్ళు మండి.

"ఏదో ఓ నైతిక ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని ఆనాడు ఆ ఆచారాల్ని సమాజం సృష్టించుకుంది. అనాడు ఆ సమాజానికి ఆ కట్టుబాట్లు గౌరవించే ఆత్మవిశ్వాసం, దైవభక్తి వున్నాయికాబట్టి అవి ఆచారాలుగా వర్ధిల్లేయి. కాలానుగుణ్యంగా అటువంటి తీవ్రమైన కట్టుబాట్లకు తట్టుకునే నైతికబలం, విశ్వాసం సడలడం వలన వాటిని మనం మానుకున్నాం. ఈనాడు వాటిని మూఢ విశ్వాసాలనడమోరకమైన మూఢ విశ్వాసం. ఒకే మొగాడు ఒకే స్త్రీ జీవితాంతం భార్యాభర్తలుగా కలిసుండాలనే ఈనాటి సామాజిక వ్యవస్థకి సంబంధించిన ఆచారం కొంత కాలానికి మూఢ విశ్వాసంగా అనాగరికంగా అనవసరంగా కనబడొచ్చు."

"కావచ్చు. పరిణామం సహజం. సుఖసంతోషాల ప్రమాణాన్ని పెంచు కోడానికి కావల్సిన మార్పుల్ని కాలానుగుణ్యంగా సమాజం సృష్టించుకుంటుంది."

"నీతి, పాపభీతి, దైవభక్తి అనే పునాదులమీద భారతీయ సంస్కృతి ఆధారపడింది. ఏ మార్పులు వొచ్చినా మన విశ్వాసాలకి భిన్నంగా వుండే సంస్కృతికిక్కడ మనుగడలేదు. ఏ విశ్వాసాలని మూఢ విశ్వాసాలని అలక్ష్యం చేస్తున్నామో వాటి ఔన్నత్యాన్ని, అవసరాన్ని పాశ్చాత్యులు స్వానుభవం వల్ల గుర్తించి గౌరవిస్తున్నారు."

"మీకు తిరుమలావు రచనలు బాగా వంటబట్టినట్టున్నాయి." అన్నాను. ఇటీవల తిరుమలావు రాసిన నవలలో ఈ ధోరణి కనబడుతుంది.

* * *

నిరంజన్‌ని చూసి నిర్ఘాంతపోయాను. అనవాలు పట్టలేనంత చిక్కిశల్యమయ్యేడు. నన్ను చూడగానే ఎక్కడ లేని సంతోషంతో పక్కమీద లేచి కూర్చుని నా రెండు చేతులూ పట్టుకున్నాడు.

"మీకు జాబు రాశానుకాని వస్తారో, రారో అని సందేహించేను. నిజంగా యింత దయకి నేను పాత్రుణ్ణి కాను" అన్నాడు.

"మీతో పది నిమిషాలు గడిపిన వాడెవడూ అవకాశం దొరికితే మళ్ళీ కలుసుకోకుండా వుండలేడు. చాలా కాలానికి మళ్ళీ కల్సుకున్నాం" అన్నాను.

"తెలుగు రచయితల మహాసభలలో కలుసుకోవడమే. మళ్ళీ నాటికి నేడు. తిరుమలరావుగారు ఇంత అకస్మాత్తుగా పోతారనుకోలేదు. కనీసం రెండు రోజుల కోసారొచ్చి ఒకటి రెండు గంటలు గడిపే వారిక్కడ."

''ఏభయ్యేళ్ళు నిండా లేవు. ఒడుదుడుకులు లేని సాఫీ అయిన జీవితం. గుండెపోటొచ్చి పోయాడంటే నమ్మలేకపోయాను" అన్నాను. అతనికి కొద్దిగా బ్లడ్‌ప్రెషర్ వున్నట్టు నాకు రాసిన మాట వాస్తవమే. అయితే, అది తన రచనల మూలంగా సంక్రమించిన మానసిక ఉద్రికత్తవల్లనై వుంటుందనీ విశ్రాంతి పట్ల అలక్ష్యం చేయొద్దనీ రాశాను.

''తాగుడు మానెయ్యి, సిగరెట్ మానెయ్యి - చచ్చిపోతావు, చచ్చిపోతావు అంటూ డాక్టర్లు నన్ను రెండేళ్ళుగా బెదిరిస్తున్నారు. గేస్ట్రిక్ అల్సర్‌కి ఆపరేషన్ చేశారు. ఎపెండిసైటిస్‌కి ఆపరేషన్ చేశారు. సెరిబ్రల్ థ్రాంబోసిస్ అన్నారు. బ్రతికేను. ఇప్పుడు లివర్ కేన్సర్ అన్నారు. మరి నాకు చావు రాలేదు.''

''ఎన్నాళ్లుండాలీ హాస్పటల్లో?'' అడిగాను. వెంటనే నా తెలివి తక్కువ ప్రశ్నకి నేనే సిగ్గుపడ్డాను.

''భూమ్మీద నూకలున్నన్నాళ్ళూ ఈ గదే నా ప్రపంచం. ఇంక రెండు మూడు నెలలకంటే బ్రతకనంటున్నారు. కాని, నాకు నమ్మకంలేదు. ఇలా మరో ఏడాది దేకించేసినా దేకించేస్తాను'' అన్నాడు నవ్వుతూ. నాకూ అలాగే అనిపించింది, అతని మనోబలం చూస్తుంటే. అయితే అతని శరీరం కేసి చూస్తే రోజు లెక్క పెట్టాలన్నట్టున్నాడు.

''తప్పకుండా బ్రదర్! కీపప్ ది స్పిరిట్'' అన్నాను.

''మనిషి చావు రావడంవల్ల చస్తాడు. ఏ రోగంవల్లో ఏ కారణంగా ఎలా చచ్చేడూ అన్నది డాక్టర్లకు సంబంధించిన విషయం. పిడుగులాంటి తిరుమలరావు గారు పోయేక చావంటే అసలే భయం పోయింది.''

''చస్తామేమోనన్న భయంతో చచ్చినవాడిలా బ్రతకడం కంటే చచ్చేవరకూ నిశ్చింతగా బ్రతకడం వివేకవంతుడి లక్షణం. ఏమిటి విశేషాలు చెప్పండి?'' అన్నాను, నాకు కబురంపిన అవసరమైన పనేమిటో తెలుసుకుందామని.

''మీరు మూడు పనులు చేసి పెట్టాలి. మళ్ళీ మనం కలుసుకోకపోతే యివే నా తుదికోరిక లనుకోండి.''

''ఏమిటవి?''

''తిరుమ్మలావుగారి పిల్లలకి ఏభై వేలివ్వదల్చుకున్నాను. చెక్కు రాసిస్తాను. వాళ్ళ పేర ఫిక్సెడ్ డిపాజిట్ చేస్తారో ఏంచేస్తారో ఆలోచించి చెయ్యండి. వాళ్లు నన్నెరుగరు. నే నిచ్చేనంటే మొహమాటపడొచ్చు.''

''తప్పకుండా.''

''మరో యిరవై వేలకి మీపేర చెక్కు రాసిస్తాను. మీకు తెలిసిన పబ్లిషర్స్ కిచ్చి, తిరుమ్మలావు రచనలు స్పెషల్ డీలక్స్ వాల్యూమ్స్ కింద వేయించి, రేట్లు తగ్గించి అమ్మేలాగ ఏర్పాటు చెయ్యండి. ఆ పుస్తకాల మీద వచ్చే రాయల్టి ఆయన పిల్లలకి వొచ్చేలా ఏర్పాటు చేయండి.''

''మీ ఔదార్యం చూస్తే నేనే తిరుమ్మలావునైతే ఎంత బాగుండేదా అనిపిస్తుంది'' అన్నాను.

''నా మూడో కోరికదే. మీరు తిరుమ్మలావుగా రవాలి - కొంతకాలం'' అన్నాడు నవ్వుతూ.

''అంటే?''

''ఏంలేదు. తను రాయదల్చుకున్న తర్వాత నవల తాలూకు కథంతా నాకు చెప్పేడు. దాన్ని మీకు చెబుతాను. మీరా కథ పూర్తిచేసి తిరుమ్మలావు గారి పేర పత్రికకు పంపాలి.''

''తిరుమ్మలావు రచనలకో ప్రత్యేక స్థానముంది. నేను రాసి తిరుమ్మలావు రచనని చెప్పి నమ్మించలేను.''

''పోనీ, మీ పేరుతోనే రాయండి.''

''నా కలాంటి గ్రంథచౌర్యం యిష్టం లేదు. ఇంతకీ ఆ కథ నన్ను రాయమనడంకంటే మీరే రాయొచ్చుగా. మీ పేరనే వేయిస్తాను'' అన్నాను సంతోషిస్తాడేమోనని.

''ఈ లోకం నేనొక రచయితనంటే నమ్మదు. రచయితగా నేనొక అనామకుణ్ణి. మీరు తిరుమ్మలావుగారికి ఆప్తమిత్రులు మంచి పేరున్న రచయితలు. అందుచేత మీ పేరు పెట్టి రాయమన్నాను.''

''ఆ నవల అసంపూర్తిగా వుండటం వల్లనే తిరుమల్రావుకి మంచి పేరొస్తుంది'' అన్నాను.

''పూర్తిచేస్తే అతని ఆత్మ శాంతిస్తుంది.''

"మనం యిష్ట మొచ్చినట్టు పూర్తి చేస్తే అతని ఆత్మ శాంతి మాటటుంచి పిశాచమై పీక్కు-తింటాడు."

"ఆ తిరుమల్రావే ప్రత్యక్షమై మిమ్మల్ని రాయమంటే?"

"ఎందుకు లెద్దురూ యీ అర్థంలేని వాదన. పోయిన తిరుమల్రావెలాగ పోయాడు. మన ప్రయోగాల్తో సాహిత్యపరంగా కూడా అతన్ని చంపడ మెందుకు?" అన్నాను, ఇంక ఆ ప్రస్తావన అవుతాడేమోనని.

"అర్థం వుంది - ఆ తిరుమల్రావే మిమ్మల్నిప్పుడు ప్రార్థిస్తున్నాడు" అన్నాడు నా రెండు చేతులూ పట్టుకుని ఒక్క- క్షణం నిర్ఘాంతపోయాను.

"ఏమిటి మీరనేది? ఇన్నాళ్ళూ తిరుమల్రావు పేర రాసింది మీరా?"

"అవును. మనిద్దరికీ తిరుమల్రావుగారు ఆత్మీయులు కాబట్టి ఈ రహస్యం మీ దగ్గర బయట పెట్టేను. ఆయన కూడా మీలాగే మొదట నిరాకరించారు. చివరికి నా బలవంతం మీద ఎంతో దయతో ఆయన పేరు ఎరువిచ్చి పుణ్యం కట్టుకున్నారు. నాలో వుండే రచయితకి జీవంపోసి పుణ్యం కట్టుకున్నారు. ఆయన పోవడంతో నాలో నాలుగు ప్రాణాలు పోయాయి. మిగిలిన యీ కాస్త ఊపిరినీ నిలబెట్టమని మిమల్ని ప్రార్థిస్తున్నాను" అన్నాడు నల్లద్దాల కళ్ళజోడు తీసి కళ్లను తువ్వాలుతో సున్నితంగా తుడుచుకుంటూ. అతనికి ఒక కన్ను పోయిందని అప్పుడే గమనించాను.

"ఇంతటి మేధావంతుడవై వుండీ, బ్రదర్, ఎందుకిలా కీర్తి ప్రతిష్టల్ని కాలదన్ని అజ్ఞాతంగా వుండాలనుకున్నావో నాకర్థం కావడంలేదు." అన్నాను.

"నా రచనలు ప్రజాదరణ పొందడమే నేను కోరేది. నా రచనే నేను. ఈ శరీరం నేను కాదు. అందవికారమైన నా శరీరం అంటే నాకసహ్యం. నా రచనలమీదుండే ప్రజల అభిమానాన్ని కుళ్ళి రాలడానికి సిద్ధంగావున్న నా శరీరంమీదకి మళ్ళించలేను. ఇతరులు నామీద జాలిపడటం నేను భరించలేను. ప్రజల గౌరవాన్ని, మన్ననల్ని అందుకోడానికి తిరుమల్రావుగారి శరీరాన్ని వాడుకున్నాను. నా రచనల్ని ప్రజలు మెచ్చుకోవటమే నాకు సన్మానం."

"భగవంతుడెంత నిర్దయుడు! ఇన్ని తెలివితేటలు, ఇంత ఐశ్వర్యం యిచ్చి మీకు ఆరోగ్యం యివ్వలేదు!" అన్నాను.

"పొరపాటు. భగవంతుడు దయామయుడు, కార్యదక్షుడు కనకనే నాకు మానసిక ఆరోగ్యాన్నిచ్చి, నేనుండటానికి మాత్రం అహంకార మమకారాలు పెంచుకోకుండా ఈ రొచ్చుకొంపలాంటి శరీరాన్నిచ్చేడు" అన్నాడు చిరునవ్వుతో.

ఇటీవల సీరియల్‌గా వొచ్చిన "కాలానికి దూరంగా" అన్న నవల తాలూకు పబ్లిషర్లు తిరుమలరావుకు పెద్ద యెత్తున సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఆ సభ జరగకముందే తిరుమలరావు కన్నుమూశాడు. ఒక ఖరీదయిన జరీ కాశ్మీర్ శాలువా, ఒక ఫౌన్‌టెన్ పెన్‌సెట్ ఒద్దంటున్నా బలవంతగా నా చేతులో పెడుతూ "తిరుమలరావు గారికి ప్రత్యేకంగా నా కృతజ్ఞత చెప్పుకోడానికి నా చేతుల్తో యిక్కడే సన్మానం చేద్దామని యివి తెప్పించేను. ఆ రోజుకు నేనుంటానో వుండనో అనుకున్నాను కాని, ఆయనే వుండడనుకోలేదు. ఆయనకి ఆప్తమిత్రులు, అన్ని అర్హతలూ వున్నవారు కనుక మీరు స్వీకరిస్తే నేను సంతోషిస్తాను. ఈ కాస్త కోరిక చెల్లించండి" అన్నాడు.

'కాలానికి దూరంగా' అన్న నవల సంచలనం తీసుకొచ్చిన ఒక విప్లవాత్మకమైన రచన. అదొక లేడీ డాక్టరు జీవిత గాథ. ఆగర్భ శ్రీమంతురాలు. డాక్టర్ పరీక్ష పేసయింది. మనస్తత్వ శాస్త్రంలో ప్రత్యేకమైన కృషి చేసి పెద్ద సైకియాట్రిస్ట్ అన్న పేరు గడిచింది. ఎందరెందరి మానసికవ్యాధులో కుదిర్చింది. ఒకే ఒక వ్యక్తి మనస్తత్వం మాత్రం తనకి అర్థం కాలేదు. అతడు తన భర్త! ఎడ్వొకేట్‌గా డబ్బు సంపాదించలేకపోయినా పేరు సంపాదించుకున్నాడనుకుంటుంటే, చివరికి ఆ వృత్తికి కూడా స్వస్తిచెప్పి సంఘసేవంటూ రాజకీయాల్లో దిగేడు. భర్త కొరకరాని కొయ్యయ్యేడనీ, ఇక అతనితో జీవించడం అసంభవమనీ, తీరని కోరికలతో వివాహ బంధం తెంపుకుని విదేశాలు వెళ్ళింది.

ధనం యౌవనం యివ్వగలిగిన ఆనందాన్నంతా ఆస్వాదించింది. దేశదేశాల్లో వైవాహిక సంబంధాలూ, కుటుంబ సభ్యుల అనుబంధాలు తాలూకు సమస్యల్ని పరిశీలించి సలహా లిచ్చేది. ఎన్నెన్నో రకాల సమస్యలు! తన స్నేహితుల్ని, తన ప్రేమకలాపాల్ని, తన అనుభవాల్ని వైజ్ఞానిక దృష్టితో పరిశీలించేది. ఏదో తీవ్రమైన లోటు, అశాంతి ఆమెని వెంటాడసాగింది. తనకు ఏం

కావాలి? ఏం చేసింది? ఏం సాధించింది? తనూ వో రకం పేషెంటేనా? తనకి అన్నీ వున్నా ఏది లేదని ఆమెకీవ్యథ?....

పశువుల్లో, కుక్కల్లో, పిల్లుల్లో, కోతుల్లోను ఆడజంతువుల కుండే తాప త్రయం, మమకారం, బాధ్యత మొగ జంతువుల కెందుకుండవు? మనిషికూడా ఇలాంటి జంతువేనా? పురుషుడికక్కర్లేని బరువు బాధ్యతలు, మమకారం స్త్రీకి మాత్రం ఎందుకు? అడుగడుగునా యివే ప్రశ్నలు.

ఆమె అన్వేషణ ఫలితంగా ఒక సత్యాన్ని గ్రహించింది. స్త్రీ ప్రకృతి సిద్ధంగా తనను తానే అర్పించుకునే త్యాగమూర్తి. సోదరిగా, భార్యగా, తల్లిగా ఆమె ఆశించిన ప్రేమకు వెయ్యిరెట్లు ప్రేమను గుమ్మరించే ఆశాజీవి. ఆత్మా ర్పణమే ఆమె జీవిత పరమావధి. తనను తాను అర్పించుకోకుండా ఏకాకిగా స్త్రీ జీవించడం ప్రకృతి విరుద్ధం.

అనారోగ్యంతో దారిద్ర్యంతో భర్త కృంగిపోతున్నాడని తెలిసి తన శేష జీవితాన్ని అతని సేవకే అంకితం చెయ్యాలన్న ఆలోచన కలగగానే ఆమె మనస్సు నిర్మలమై ఆనందంలో తేలిపోయింది. ఆ నిర్ణయం తీసుకున్న సాయంత్రం ప్రపంచ వనితలకల్లా భారతస్త్రీయే ఆదర్శమూర్తి అనీ, వైవాహిక బంధంలో వుండే పవిత్ర విశ్వాసమే భారతీయ సంస్కృతికి ఆధారమనీ మహో ద్వేగంతో క్లబ్బులో ఉపన్యసించి, సాయంత్రం ప్లేన్లో బయల్దేరి, మర్నాడు భారత దేశం చేరుకుంది. రెక్కలు కట్టుకు వాలినా అప్పటికే ఆలస్యమైపోయింది....ఇదీ టూకీగా కథ. ఇంచుమించు ఒక సంవత్సరం పాటు వారపత్రికలో సీరియల్‌గా వొచ్చి, సాహిత్య జగత్తులో సంచలనం కలిగించింది.

నేను తిరిగి వొచ్చేసేముందు నిరంజన్ త్వరలో కథరాసి పంపడానికీ దాన్ని అవసరమైన హంగులతో నేను నవలగా రూపొందించి తిరుమ్మలావు పేరనే ప్రచురించడానికి ఒప్పందం చేసుకున్నాం. కొన్ని ముఖ్యమైన సన్నివేశాల గురించి కూడా చర్చించాం. పదిహేను రోజుల తర్వాత నేను స్క్రిప్టుకోసం ఎదురు చూస్తుంటే అతను మరణించినట్టు వార్త వచ్చింది. వార్డ్‌బాయ్ వుత్తరం రాశాడు. అతనికి సీరియస్‌గా వుందని తెలియగానే, రెండు రోజులకు పోతాడనగా పోర్ట్ బ్లెయిర్ నుంచి వాళ్ళ కంపెనీ డైరెక్టర్లంతా వచ్చేరుట. అంత్యక్రియలు అండ మాన్‌లోనే జరగాలని శవాన్ని ప్లేన్లో తీసుకెళ్ళేరుట.

* * *

అరుణా విశ్వనాథ్‌ల దగ్గిర్నుంచి శుభలేఖొచ్చింది. వాళ్ళు కొత్తగా కట్టుకున్న 'నిరంజన్ కుంజ్'లో గృహప్రవేశం. విందు భోజనానికి రమ్మని ఆహ్వానం. నిరంజన్ కుంజ్ పేరు బాగుంది. నాకు నిరంజన్ జ్ఞాపకమొచ్చేడు. అప్పటికి అతనుపోయి ఆర్నెళ్ళయింది, అతనిచ్చిన కాశ్మీర్ శాలువా కూడా జ్ఞాపకమొచ్చింది. దానికింకా పసుపుబొట్టు పెట్టలేదు.

నేను వెళ్ళేటప్పటికి వాళ్ళిద్దరూ పీటలమీద కూర్చున్నారు. డోలు సన్నాయి వాయిద్యాలు నిర్విరామంగా మోగుతున్నాయి. నన్ను చూడగానే వాళ్ళిద్దరూ ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకుని గుసగుసలాడుకుని కుర్చీలో కూర్చోమని సౌజ్ఞ చేశారు. కూర్చోగానే "ఇదేదో సన్మానం బాపతులా గుందే!'' అని నేను కండువా లాగ కప్పుకున్న శాలువా జరీ అంచు పట్టుకుని ముత్యం పలకరించగానే అరుణ విశ్వనాథ్ దంపతులు కూడా నా వైపు తేరి పారి చూడటానికి కదే కారణమని గ్రహించాను.

భోజనాలకి కూర్చునే ముందు విశ్వనాథ్ నా దగ్గిరకొచ్చి శాలువాని పరిశీలనగా చూస్తూ ''చాలా బాగుంది. ఎక్కడ కొన్నారు?'' అని అడిగేడు.

'కొనలేదు. ఓ మంచి స్నేహితుడు ప్రజెంట్ చేశాడు. అంత బాగుందా?' అన్నాను.

"ఆర్నెళ్ళక్రితం నేనూ అరుణా హైదరాబాదంతా తిరిగి తిరిగి యిలాంటిదే కొని మా బావమరిది కిచ్చేము'' అన్నాడు.

''మీ బావమరిది పేరు?''

''నిరంజన్. ఇండో అండమాన్స్ మేనేజింగ్ డైరెక్టర్. పాపం, కేన్సర్ జబ్బుతో పోయేడు'' అన్నాడు.

"ఆ నిరంజనే నాకిచ్చేడు. అరుణ నిరంజన్ చెల్లెలా!'' అన్నాను ఆశ్చర్యంగా. అప్పుడే అర్థమయింది-యింటికి 'నిరంజన్ కుంజ్' అని ఎందుకు పేరెట్టుకున్నారో.

"అవును. తిరుమల్రావుగారికి సన్మానం చెయ్యాలి, మంచి కాశ్మీర్ శాలువా తీసుకురమ్మని పురమాయిస్తే యిది తెచ్చియిచ్చేం. అది మీ దగ్గిరకి రావడం నాకెంతో సంతోషంగా వుంది. అరుణ కూడా బ్రహ్మానందపడుతుంది'' అన్నాడు.

తిరుమల్రావు కోసం కొన్న శాలువా నా దగ్గిరకి రావడంవల్ల వీళ్లిద్దరూ యింత ఆనందిస్తున్నారంటే వాళ్ళకి తిరుమల్రావంటే ఎంత దురభిప్రాయముందో తెలిసింది. భోజనాలయ్యేక అందరూ వెళ్ళిపోయినా, వాళ్ళ నిర్బంధం మూలంగా కాస్సేపు కూర్చున్నాను. మాటల సందర్భంలో నేను గ్రహించిందేమిటంటే- తిరుమల్రావు పేరుతో వొచ్చిన నవలలు నిరంజన్ రాసినవేనని అరుణకి తెలుసు. గత మూడు సంవత్సరాలుగా నిరంజన్ హైదరాబాద్ వొచ్చినప్పుడల్లా అరుణ వెళ్లి అతని యోగక్షేమాలు తెలుసుకుని, ఒకటి రెండు రోజులుండి వచ్చేది. తిరుమల్రావుతో కూడా నిరంజన్ గదిలోనే పరిచయమైంది. అయితే, నిరంజన్‌కి చేసిన వాగ్దానానికి కట్టుబడి తిరుమల్రావు రచనల నిజ స్వరూపాన్ని గురించి ఎక్కడా నోరు మెదపలేదు.

'మా పాప' శిల్పంలో కూడా అక్కడక్కడ స్ఫురించే చక్కని నగిషీపని నిరంజన్‌దే అయి వుంటుందన్న సందేహాన్ని నివృత్తి చేసుకోడానికి ''మా పాప వ్రాతప్రతి నిరంజన్ చూసేడా?'' అని అడిగేను.

''చూసి చాలా మెచ్చుకున్నాడు, అసలు మా అన్నయ్య తన కథలూ నవలలూ నా పేరుతో పత్రికలకి పంపమన్నాడు; నేనే వొద్దన్నాను'' అంది. నిరంజన్ నాకు చెప్పిన విషయాల దృష్ట్యా అది శుద్ధ అబద్ధమని నాకు తెలుసు. అయితే, తన అన్న రాసిన వాటికి మరొకడు పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తున్నాడనే అసూయ చెల్లెలికుండటంలో ఆశ్చర్యంలేదు.

''మనమెవళ్లం నిరంజన్ స్థాయికి చేరలేము. నేను వేరు, నాలో వుండే రచయిత వేరు నా దృక్పథం, నా నమ్మకాలు వేరు; నాలో వుండే రచయిత దృక్పథం నమ్మకాలు వేరు. నేను రాస్తే ఓలాగుంటుంది. నాలో వుండే రచయిత రాస్తే మరోలా వుంటుంది. మొదట్లో మనలో వుండే రచయితకి స్వాతంత్ర్యం యిస్తాం. అందుకే ఆ రచనల్లో ప్రత్యేకమైన హృదయ స్పందన వుండి, సహజంగా వుంటాయి. నిరంజన్‌కి రచయితగా తప్ప వేరే వ్యక్తిత్వం లేదు. ఆతనికి కీర్తి ప్రతిష్టలమీద ఆశలేదు. అతని రచనే అతని జీవం. అందుకే అంతటి రచయి తయ్యేడు" అన్నాను.

''కాని, లోకానికి తెలిసిన రచయిత తిరుమల్రావుగారు'' అంది అరుణ.

''అభిమానాన్ని త్యాగం చేసిన తిరుమల్రావు కృషి కూడా ఫలించడం వల్లనే నిరంజన్ ఉత్సాహంతో ఇన్ని రచనలు చేయగలిగేడు'' అన్నాను.

"తిరుమల్రావుగారు చేసింది ఎంత వరకూ త్యాగమో నాకు తెలీదు. తన పేరుతో మా అన్నయ్య రచనలు ప్రచురించుకోడమే కాకుండా మా వదినను కూడా పెళ్ళాడేడు'' అంది.

''మీ వదినంటే?''

''మా అన్నయ్య భార్య తిరుమల్రావుగారి రెండో భార్య.''

''నిరంజన్‌కి తెలుసునా?''

''తెలియదనుకుంటాను.''

''ఈ విషయం నీ కెప్పుడు తెలిసింది?'' అడిగేను.

''తిరుమల్రావుగారు పోయేముందు మేము హైదరాబాద్ వెళ్ళినప్పుడు 'ఎండ మావులు' ఫిల్మ్ ప్రివ్యూకి వెళ్ళేం. తలవని తలంపుగా వాళ్ళనక్కడ చూశాం. మా వొదినని తన భార్యగా పరిచయం చేశాడు. నేను నిర్ఘాంతపోయేను. ఆమె నన్ను చూసి తెల్లమొహం వేసింది. అప్రయత్నంగా 'వొదినా!' అన్నాను. ఏడెనిమిదేళ్ల క్రితం ఆమెని మా అన్నయ్య పెళ్ళికి చూడటమే. తర్వాత వాళ్లు అండమాన్స్ వెళ్ళిపోయేరు. నన్ను గుర్తుపట్టి, నా రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకున్నప్పుడు మా యిద్దరి కళ్లల్లోనూ నీళ్లు తిరిగేయి. పెళ్లైన తర్వాత రెండేళ్లయినా వాళ్లు కాపరం చేయ్యకుండానే మా అన్నయ్యకి మశూచికం వొచ్చి వో కన్ను పోయింది. ఆ తర్వాత....''

''నాకు తెలుసు. ఆమె అమెరికా వెళ్ళిపోయింది. అక్కడామె వుండగానే తిరుమల్రావు ఆమెని కలుసుకున్నాడు. ఇండియాకి తిరిగొచ్చి ఏదో వ్యాపకం కల్పించుకోటానికి ఉద్యోగం చూసుకునే సందర్భంలో ఆమె మళ్లీ తిరుమల్రావుని కలుసుకుంది. ఆ తర్వాత పరిణామాలు మనకి తెలుసు. ఇంతకీ ఆమె నిరంజన్ భార్యని తిరుమల్రావుకు తెలుసునా?''

''మొన్న యీ సంఘటనతో ఆయన ఆశ్చర్యంతో మూర్ఛపోయినంత పని చేశాడు- అది నిజమో నటనోకాని.''

''ఆ షాక్‌తోనే అతనికి గుండె పోటొచ్చి మరణించి వుంటాడు. తిరుమల్రావు వారం రోజుల్లో పోతాడనగా తనని కలుసుకోవడం మానేశాడని నిరంజన్ చెప్పాడు. తిరుమల్రావు జీవించివుంటే మరికొన్నాళ్ళు నిరంజన్ జీవించి వుండేవాడేమో?'' అన్నాను.

అరుణ మౌనంగా శూన్యంలోకి చూస్తూ ఆలోచనలో పడింది. *

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 3-2-'78.)